ప్రజాశక్తి



శనివారం 10 డిసెంబరు 2022

5

శ్రీకాకుళం

జెసి ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి - శ్రీకాకుళం రూరల్

రైతుభరోసా కేంద్రాల నుంచి ధాన్యం సేకరించి పంపిస్తున్న మండలంలోని నైరలో గల శ్రీకన్య మిల్లును జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. మండల పరిధిలోని ఆరు రైతుభరోసా కేంద్రాల నుంచి సేకరించిన సుమారు 800 క్వింటాళ్ల ధాన్యం శ్రీకన్య మిల్లుకు చేరుకున్నాయి. అక్కడ ధాన్యాన్ని అన్‌లోడ్ చేసే విధానం, ఎక్కడ నుంచి వచ్చింది తదితర వివరాలను మిల్లరును అడిగి తెలుసుకొని సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట పౌర సరఫరాల అధికారి డి.వి.రమణ, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ పి.జయంతి, తహశీల్దార్ కె.వెంకటరావు, ఉప తహశీల్దార్ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

'మాండూస్' గుబులు

- తుపాను ప్రభావంతో ఒక్కసారిగా మారిన వాతావరణం
- అక్కడక్కడా చిన్నపాటి చినుకులు
- కోసిన వరిని కాపాడుకునేందుకు రైతుల పరుగులు
- మందకొడిగా ధాన్యం కొనుగోళ్లు

మాండూస్ తుపాను రైతులను కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. శుక్రవారం తీవ్ర తుపానుగా మారడంతో ఆ ప్రభావం జిల్లాలోనూ కనిపించింది. ఉదయం నుంచే ఆకాశం మేఘావృతమై టెన్షన్‌కు గురిచేసింది. మరోవైపు చలిగాలుల తీవ్రత బాగా పెరిగింది. కొన్నిచోట్ల చిన్నపాటి చినుకులూ పడడంతో రైతుల్లో కలవరం మొదలైంది. వరికోతలు ముమ్మరంగా సాగుతున్న నేపథ్యంలో వర్ష భయం వెంటాడుతుండడంతో ఏం చేయాలో వారికి తోచడం లేదు. కొన్నిచోట్ల పంట కోసి కుప్పలుగా పోశారు. మరికొన్ని ప్రాంతాల్లో ధాన్యం బస్తాలను సిద్ధం చేసినా కొనుగోలు చేయకపోవడంతో ఆరుబయటే ఉన్నాయి. ధాన్యం తడిచిపోకుండా పరదాల కప్పుతూ పంటను కాపాడుకునే పనిలో అన్నదాతలు నిమగ్నమయ్యారు.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

జిల్లాలో ఈ ఏడాది 3,82,650 ఎకరాల్లో వరి పంట సాగు అయింది. అధికారుల అంచనా ప్రకారం 8.11 మెట్రిక్ టన్నుల ధాన్యం రావచ్చని అధికారులు అంచనా వేశారు. జిల్లాలో అన్ని ప్రాంతాల్లో వరి కోతలు మొదలయ్యాయి. వర్షాభావ పరిస్థితులతో ఆలస్యంగా ఉబాలు వేసిన పలాస, టెక్కలి నియోజకవర్గాల్లోని పలు ప్రాంతాల్లో ఇప్పుడిప్పుడే కోతలు ప్రారంభిస్తున్నారు. ఇటువంటి తరుణంలో వాతావరణంలో ఒక్కసారిగా మార్పులు సంభవించడంతో రైతులు పొలాలకు పరుగులు తీశారు. కోసిన పంటను కాపాడుకునే పనిలో పడ్డారు. సాధారణంగా వరి చేను ఎండిన తర్వాత కుప్పలు పెట్టాల్సి ఉంటుంది. మారిన వాతావరణంతో పచ్చిగా ఉన్న పైరును కుప్పలుగా పెట్టాల్సి వస్తోంది. పొలాలకు సమీపంలో ఉన్న రహదారులపై కుప్పలు పెడుతున్నారు. మరికొందరు పంటను రక్షించుకోవడానికి సుదూర ప్రాంతాలకు తరలించాల్సి రావడంతో తీవ్ర వ్యయ ప్రయాసలకు లోనవుతున్నారు. పంటకోతకు సిద్ధమవుతున్న వారు తుపాను పరిస్థితిని చూసి వెనక్కి తగ్గుతున్నారు. ఈ సమయంలో వర్షంతో పాటు చిన్నపాటి గాలి వీచినా వరికి తీవ్ర నష్టం ఉంటుందని వ్యవసాయశాఖ అధికారులు చెప్తున్నారు.



కోటబొమ్మాళి : కుప్పలు పెడుతున్న రైతులు

మందకొడిగా ధాన్యం కొనుగోళ్లు

జిల్లాలో మందకొడిగా ధాన్యం కొనుగోళ్లు కొనసాగుతున్నాయి. రైతులు ధాన్యం సిద్ధం చేసినా, ఇంకా వారికి టోకెన్లు ఇవ్వడం లేదు. గత నెల 24వ తేదీ నుంచి ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించారు. జిల్లాలో 272 మిల్లులు ఉండగా 166 మిల్లుల్లోనే ఫోర్టిఫైడ్ నాన్ సార్టెక్స్ యంత్ర సామగ్రి ఉంది. ఇప్పటివరకు 152 కేంద్రాల్లోనే కొనుగోళ్లు మొదలయ్యాయి. ఇప్పటివరకు 5,421 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు చేశారు. ఆమదాలవలసలోని సైలాడ, కంచిలిలో గోకర్ణపురం ఆర్‌బికెల్లోనే కొనుగోలు మొదలయ్యాయి.

బూర్జ, జి.సిగడాం, పాతపట్నం మండలాల్లో ఐదేసి కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లు మొదలయ్యాయి. ఎచ్చెర్ల, టెక్కలి, నందిగాం, పలాసలో మండలాల్లో రెండు కేంద్రాల్లో ప్రారంభమయ్యాయి. పోలాకిలో నాలుగు చోట్ల గార, పలాస మండలాల్లో ఆరు కేంద్రాల్లో చొప్పున కొనుగోళ్లు ప్రారంభించారు. హిరమండలం, శ్రీకాకుళం, కోటబొమ్మాళి మండలాల్లో తొమ్మిది కేంద్రాలు చొప్పున, జలుమూరులో 13 కేంద్రాలు, కొత్తూరు, రణస్థలం మండలాల్లో మూడు కేంద్రాలు, ఎల్ఎన్‌పేటలో 11 కేంద్రాలు, మెళియాపుట్టిలో మూడు కేంద్రాలు, నరసన్నపేటలో 15 కేంద్రాల్లో మొదలయ్యాయి. సంతబొమ్మాళి, సరుబుజ్జిలి మండలాల్లో ఎనిమిది చొప్పున, సారవకోటలో 19 కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు మొదలయ్యాయి.

ఆ మండలాలో ఇంకా మొదలు కాలేదు

జిల్లాలో 30 మండలాల ఉండగా ఇప్పటివరకు 23 మండలాల పరిధిలోని కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సేకరణ మొదలైంది. ఇంకా ఏడు మండలాల పరిధిలో ఏ ఒక్క కేంద్రంలోనూ ప్రారంభం కాలేదు. వాటిలో లావేరు, పొందూరు, కవిటి, సోంపేట, ఇచ్ఛాపురం, వజ్రపుకొత్తూరు తదితర మండలాలు ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేస్తే సిద్ధం చేసిన ధాన్యాన్ని కాపాడవచ్చని రైతులు చెప్తున్నారు.

పట్టభద్రుల ఓటర్ల జాబితాలో అక్రమాలు

డిఆర్‌ఒకు యుటిఎఫ్ ఫిర్యాదు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గానికి సంబంధించి విడుదల చేసిన ముసాయిదా గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్ల జాబితాలో పలు అక్రమాలు చోటుచేసుకున్నాయని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి చౌదరి రవీంద్ర, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.అప్పారావు, ఎస్.కిషోర్ కుమార్, బి.క్రాంతికుమార్ తెలిపారు. తక్షణమే వాటిని సరిచేయాలని కోరారు. ఈమేరకు జిల్లా రెవెన్యూ అధికారి ఎం.రాజేశ్వరిని కలెక్టరేట్‌లోని ఆమె ఛాంబరులో శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. జిల్లాలో 48 వేల పట్టభద్రుల ఓటర్లు నమోదైతే, వాటిలో ఆరు వేలకు పైగా ఒకటి కంటే ఎక్కువసార్లు నమోదైనవని తెలిపారు. 912 మంది డిగ్రీ కంటే తక్కువ విద్యార్హత కలిగిన వారున్నారని, నిరక్షరాస్యులనూ పట్టభద్రులుగా నమోదు చేశారని తెలిపారు.



వినతిపత్రం అందిస్తున్న యుటిఎఫ్ నాయకులు


194 మంది ఓటర్లకు ఎదురుగా ఎటువంటి విద్యార్హతలు లేనట్లు నమోదయ్యాయని చెప్పారు. ఆన్‌లైన్‌లో, ఆఫ్‌లైన్‌లో నమోదు చేసుకున్న చాలామంది ఓట్లు ముసాయిదా జాబితాలో ప్రచురితం కాలేదన్నారు. వాటిని వెంటనే సరిచేయాలని కోరారు. అర్హులైన వారు ఓటర్లుగా ఉండేలా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.

ఉద్దాన ప్రజలందరికీ వైద్య పరీక్షలు

జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా

ప్రజాశక్తి - శ్రీకాకుళం

ఉద్దానం ప్రాంత ప్రజలందరికీ వైద్య పరీక్షలు నిర్వహించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా అన్నారు. హైకోర్టు ఆదేశాల మేరకు సంబంధిత అధికారులతో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. డయాలసిస్ మెషిన్లు, వైద్యులు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. ఉద్దానం ప్రాంతంలో కిడ్నీ వ్యాధి వ్యాప్తిని అరికట్టేందుకు ప్రభుత్వ, ప్రయివేటురంగ సంస్థలు కలిసి కృషి చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఎస్‌పి జి.ఆర్ రాధిక, జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి బి.మీనాక్షి, ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి ఇన్‌ఛార్జి సూపరింటెండెంట్ సునీల్ నాయక్, జిల్లా రెవెన్యూ అధికారి రాజేశ్వరి, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఇఇ శంకర్‌నాయక్ పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా

రెండో శనివారం సెలవు తప్పనిసరి

- అమలు చేయని కళాశాలల గుర్తింపు రద్దునకు చర్యలు
- రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు సీతారాం

ప్రజాశక్తి - శ్రీకాకుళం

ప్రతి నెలా రెండో శనివారం, ప్రతి ఆదివారం కార్పొరేట్, ప్రయివేట్ ఇంటర్ కళాశాల యాజమాన్యాలు సెలవులు అమలయ్యేలా ఇంటర్మీడియట్ బోర్డు అధికారులు చర్యలు ముమ్మరం చేయాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం అన్నారు. నగరంలోని ఆర్ఐఒ కార్యాలయంలో ఆర్ఐఒ ఎస్.తవిటినాయుడుతో కలిసి శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సెలవుల అమల్లో అలసత్వం వహిస్తున్న కళాశాలలను గుర్తించి కమిషన్ దృష్టికి తీసుకొస్తే, వాటి గుర్తింపు రద్దుపై ప్రభుత్వానికి సిఫార్సు చేయనున్నామని చెప్పారు. ఇంటర్ బోర్డు అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. త్వరితగతిన అన్ని కళాశాలల యాజమాన్యాలతో సమావేశం ఏర్పాటు చేసి స్పష్టమైన ఆదేశాలు జారీ చేయాలని సూచించారు. విద్యార్థుల తల్లిదండ్రులు, పలు బాలల హక్కుల సంఘాలు, మానసిక వైద్యులు, వ్యక్తిత్వ వికాస నిపుణుల సూచనలకు అనుగుణంగా చేపడుతున్న చర్యలకు అందరి సహాయ సహకారాలు కమిషన్‌కు అవసరమన్నారు.

ప్రతి నెలా రెండో శనివారం, ప్రతి ఆదివారం సెలవుల అమలుపై అన్ని ప్రయివేటు, కార్పొరేట్ కళాశాలల యాజమాన్యాలకు నోటీసులు అందిస్తున్నామని ఆర్ఐఒ ఎస్.తవిటినాయుడు తెలిపారు. రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఆదేశాల మేరకు సెలవుల అమలుకు ప్రత్యేక తనిఖీ బృందాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. కళాశాలలు తెరిచినట్లు తమ దృష్టికి వస్తే తక్షణమే ఆయా కళాశాలల అనుమతులు రద్దు చేస్తామన్నారు. సమావేశంలో సిడబ్ల్యుసి చైర్‌పర్సన్ యు.శ్రీలక్ష్మి, సభ్యులు వి.రమణమూర్తి, ఎం.గన్నెప్పడు, జిల్లా బాలల సంరక్షణ అధికారి కె.వి రమణ, సిఆర్‌పిఎఫ్ జిల్లా కన్వీనర్ కొత్తకోట శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు సీతారాం



ధర్నా చేస్తున్న టోల్‌ప్లాజా కార్మికులు

టోల్‌ప్లాజా కార్మికులను ఆదుకోవాలి

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఎచ్చెర్ల మండలం చిలకపాలెం టోల్‌ప్లాజా కార్మికులను ఆదుకోవాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, జిల్లా కార్యదర్శి ఎన్.వి రమణ డిమాండ్ చేశారు. టోల్‌ప్లాజా కార్మికులకు న్యాయం చేయాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యాన నగరంలోని డేఅండ్‌నైట్ కూడలిలోని కార్మికశాఖ కార్యాలయం వద్ద శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిలకపాలెం టోల్‌ప్లాజా ఎత్తివేసి ఇక్కడి ఆదాయాన్ని నాతవలస, మడపాం టోల్‌ప్లాజాల్లో సర్దుబాటు చేసిన నేషనల్ హైవే అధికారులు 15 ఏళ్లుగా పనిచేస్తున్న 106 మంది కార్మికులను గాలికొదిలేశారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులను ఈ టోల్‌ప్లాజాల్లో సర్దుబాటు చేసి విధుల్లో కొనసాగించాలని డిమాండ్ చేశారు. వారికి గ్రాట్యూటీ నష్టపరిహారం చెల్లించాలన్నారు. దేశం కోసం సరిహద్దుల్లో కాపలా కాసిన మాజీ సైనికులపై ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదన్నారు. అధికార యంత్రాంగం వెంటనే జోక్యం చేసుకుని కార్మికులకు న్యాయం చేయాలన్నారు. అనంతరం అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ కె.అజయ్ కార్తికేయను కలిసి వినతిపత్రం అందజేశారు. ధర్నాలో చిలకపాలెం టోల్‌ప్లాజా ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వి.వెంకటరమణ, డి.వి నర్సింహులు, ఎం.శంకరనారాయణ, ఎ.వి.ఆర్ మూర్తి, పి.రాము, ఎస్.సీతారాం తదితరులు పాల్గొన్నారు.

రైతుల సమస్యలు మీకు పట్టవా..!

- అధికారులపై కలెక్టర్ ఆగ్రహం
- నలుగురు అధికారుల సస్పెన్షన్‌కు ఆదేశాలు

ప్రజాశక్తి - కోటబొమ్మాళి

ధాన్యం సేకరణలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు మీకు పట్టవా అంటూ కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ అధికారులపై మండిపడ్డారు. మండలంలోని పెద్దబమ్మిడిలో శ్రీ మాస్టర్ వేబ్రిడ్జిని శుక్రవారం పరిశీలించారు. అదే సమయంలో ఆ బ్రిడ్జికి కన్నేవలసకు చెందిన రైతు ఆదినారాయణ ట్రాక్టరులో ధాన్యం తీసుకొచ్చారు. చీపుర్లపాడు రైతుభరోసా కేంద్రంలో 40 బస్తాలను 80 కిలోలు లెక్కన అంచనాగా ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. వేబ్రిడ్జిలో ఒక్కో బస్తా 82 నుంచి 88 కిలోలు అదనంగా చూపించింది. రైతుభరోసా కేంద్రంలో ఆన్‌లైన్‌లో నమోదు చేసిందే లెక్కలోకి వస్తుందని, అదనపు ధాన్యం ఇక్కడ దించేయాలని రైతుకు వేబ్రిడ్జి సిబ్బంది చెప్పారు. అక్కడే ఉన్న కలెక్టర్, ఆర్‌బికెలో అలా ముందే ఇన్ని క్వింటాల ధాన్యం బస్తాలని ఎలా నమోదు చేస్తారని ప్రశ్నించారు. మిగిలిన ధాన్యంతో రైతు ఇక్కడ ఉండిపోవాల్సిందేనా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికే ముగ్గురు రైతులకు ఇలాంటి సమస్య ఎదురైందని, ధాన్యంతో గంటల కొద్దీ ఇక్కడే ఉండిపోయారని వేబ్రిడ్జి యజమాని కలెక్టర్‌కు తెలిపారు. దీంతో కలెక్టర్ చీపుర్లపాడు ఆర్‌బికెను పరిశీలించారు. రైతు తెచ్చిన ధాన్యం ఎన్ని క్వింటాళ్లు ఉంటాయన్నది మీరే ఎలా చెప్తారని అధికారులను ప్రశ్నించారు. అంచనాకు మాత్రమే వేశామని, ఇలా అవుతుందని తమకు తెలియదని సిబ్బంది బదులిచ్చారు. ధాన్యం కొనుగోలుపై ఆర్‌బికెల సిబ్బందికి అవగాహన కల్పించామని, ఆన్‌లైన్ కొనుగోలుపై దృష్టిసారించలేదని సిఎస్‌డిటి కె.రాము, వ్యవసాయాధికారి ఎస్.గోవిందరావు తెలిపారు. ఆగ్రహం వ్యక్తం చేసిన కలెక్టర్ సిఎస్‌డిటి, వ్యవసాయాధికారి, ఎఇఒ శిమ్మ రామకృష్ణ, జిఇసి ప్రతినిధి ఎన్.వరలక్ష్మిని సస్పెండ్ చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో తహశీల్దార్ జె.ఈశ్వరమ్మ, మండల పరిషత్ సూపరింటెండెంట్ ఎస్.రాజేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.



వ్యవసాయ అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు

- జాతీయ రహదారులకు ఇరువైపులా బారికేడ్లు
- ప్రధాన కూడళ్ల వద్ద హైమాస్ట్ లైట్లు
- చిలకపాలెం టోల్‌ప్లాజా ఉద్యోగుల సర్దుబాటు
- కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

జిల్లాలో పోలీస్, రవాణా, ఆర్అండ్‌బి, జాతీయ రహదారి శాఖలు సమన్వయంతో పనిచేసి రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు చేపట్టాలని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ ఆదేశించారు. రహదారి భద్రతపై జిల్లాస్థాయి సమన్వయ కమిటీ సమావేశాన్ని కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో సుమారు 175 కిలోమీటర్ల మేర జాతీయ రహదారి ఉందన్నారు. హైవే నుంచి గ్రామాల్లోకి వెళ్లేందుకు సర్వీస్ రోడ్ల వివరాలు తెలిపే బోర్డులు లేకపోవడంతో వాహనదారులు రాంగ్ రూట్‌లో వెళ్లడం వల్ల ప్రమాదాలు సంభవిస్తున్నాయని తెలిపారు. జాతీయ రహదారికి ఇరువైపులా బారికేడ్లను ఏర్పాటు చేయాలన్నారు. రాంగ్ రూట్‌లో వెళ్లే వాహనదారులకు అపరాధ రుసుము విధించాలని ఆదేశించారు. హైవేపై స్పీడ్ లిమిట్ బోర్డులను ఇరువైపులా ఏర్పాటు చేయాలని సూచించారు. అతివేగం, మద్యం సేవించి వాహనం నడపడం వల్ల సంభవించే ప్రమాదాలపై ప్రభుత్వ, ప్రయివేటు వాహనాల డ్రైవర్లకు అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. ప్రధాన కూడళ్ల వద్ద బోర్డులతో పాటు హైమాస్ట్ లైట్లు లేవని పోలీసు, ఉప రవాణా శాఖాధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకురావడంతో, వాటిని ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జాతీయ రహదారి నుంచి గ్రామాల్లోకి వెళ్లేందుకు జీబ్రా లైన్స్ ఎక్కడా కనిపించడం లేదని, తద్వారా ప్రమాదాలకు అవకాశం కలుగుతోందని చెప్పారు. జిల్లాలో ఎక్కువగా ప్రమాదాలు సంభవించే కవిటి, కోటబొమ్మాళి మండలం మంచాలపేట, లావేరు మండలం అదపాక, ఎచ్చెర్ల మండలం చిలకపాలెం, రణస్థలం మండలం కోష్ట తదితర ప్రాంతాల్లో ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. 20 ఏళ్లుగా చిలకపాలెం టోల్‌ప్లాజాలో పనిచేస్తూ రోడ్డున పడిన ఉద్యోగులను ఇతర ప్లాజాల్లోకి సర్దుబాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. పాతపట్నం హైవేపై సారవకోట వద్ద టోల్‌ప్లాజాను ఏర్పాటు చేయనున్నట్లు హైవే అధికారులు తెలిపారు. ఆ ప్లాజాలో చిలకపాలెం టోల్‌ప్లాజా సిబ్బందిని నియమించాలని ఆదేశించారు.

జిల్లాలో స్వీయ ప్రమాదాలు ఎక్కువగా సంభవిస్తున్నట్లు గుర్తించామని అదనపు ఎస్‌పి టి.పి విఠలేశ్వర్ తెలిపారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలోని హైవేలపై డ్రమ్ములను ఏర్పాటు చేసి వేగాన్ని నియంత్రిస్తున్నట్లు చెప్పారు. ప్రమాదాలు సంభవించే ప్రదేశాల్లో బ్యానర్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రమాదాల నివారణపై సినిమాలను ప్రదర్శిస్తూ గ్రామ ప్రజల్లో చైతన్యం కలిగిస్తున్నామని తెలిపారు. ఈ ఏడాదిలో నవంబరు వరకు 743 రహదారి ప్రమాదాలు సంభవిస్తున్నాయని, అందులో 242 మంది మృతి చెందినట్లు ఉప రవాణా కమిషనర్ సిహెచ్.శ్రీదేవి తెలిపారు. సమావేశంలో జాతీయ రహదారుల డిప్యూటీ మేనేజర్ సతీష్, జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి బి.మీనాక్షి, నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేషు, ఆమదాలవలస మున్సిపల్ కమిషనర్ ఎం.రవిసుధాకర్, ఇతర శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

పారదర్శకంగా కోర్టు ఉద్యోగాల భర్తీ

- దళారులను నమ్మి మోసపోవద్దు
- జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా



ప్రజాశక్తి - శ్రీకాకుళం లీగల్

కోర్టుల్లో ఉద్యోగాలను పారదర్శకంగా భర్తీ చేయనున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా స్పష్టం చేశారు. దళారులను నమ్మి మోసపోవద్దన్నారు. కోర్టుల్లో పలు కేడర్లలో ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్‌ను జారీ చేసినట్లు తెలిపారు. ఈనెల 21 నుంచి వచ్చే నెల రెండో తేదీ వరకు పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అర్హతే ప్రామాణికంగా, పారదర్శకంగా ఉద్యోగ నియామకాలను చేపట్టబోతున్నామని చెప్పారు. ఉద్యోగాలు వేస్తామని ఎవరైనా చెప్తే పోలీసులను ఆశ్రయించినా, తమ దృష్టికి తీసుకొచ్చినా చర్యలు తీసుకుంటామన్నారు. ఉద్యోగాలు ఇప్పిస్తామన్న ఎలాంటి మాయమాటలను నమ్మొద్దన్నారు. పరీక్షల్లో మెరిట్ వచ్చిన వారికి మాత్రమే ఉద్యోగాలు వస్తాయన్నారు.

పరిశ్రమలతో యువతకు ఉపాధి అవకాశాలు



ప్రజాశక్తి - శ్రీకాకుళం

పరిశ్రమల స్థాపనకు యువతకు కేంద్ర ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తుందని జిల్లా పరిశ్రమల అధికారి జె.ఉమామహేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. సాంకేతిక, రక్షణ తదితర అవసరాలను దృష్టిలో ఉంచుకుని పరిశ్రమల స్థాపనకు కేంద్రం చర్యలు చేపట్టిందని పేర్కొన్నారు. సాంకేతిక అభివృద్ధి నిధి పథకం కింద డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ (డిఆర్‌డిఒ) పోలీసు బలగాల అవసరాలతో సహా రక్షణ, ద్వంద్వ వినియోగ సాంకేతికతలను అభివృద్ధి చేయడానికి ప్రయివేటు రంగాన్ని భాగస్వామ్యం చేసిందని తెలిపారు. ట్రై సర్వీసెస్, డిఫెన్స్ ప్రొడక్షన్, డిఆర్‌డిఒ అవసరాలను తీర్చడానికి రక్షణ తయారీకి అత్యాధునిక సాంకేతిక సామర్థ్యాన్ని పెంపొందించడానికి చర్యలు తీసుకుందని పేర్కొన్నారు. ప్రభుత్వ, ప్రయివేటు పరిశ్రమలు, ఎంఎస్ఎంఇ, స్టార్టప్‌ల భాగస్వామ్యాన్ని ప్రోత్సహిస్తుందని తెలిపారు. ప్రాజెక్టు గరిష్ట అభివృద్ధి వ్యవధి రెండేళ్లని స్పష్టం చేశారు. డిజైన్, సంస్థ సామర్థ్యం, ఫ్యాబ్రికేషన్, తయారీ సామర్థ్యం, నిర్వహణ, వాణిజ్య సాధ్యత, ప్రొఫైల్‌ను పరిగణనలోకి తీసుకుంటామని తెలిపారు. ఆసక్తి గల యువత ముందుకొచ్చి పరిశ్రమలను స్థాపించి తమ ఆర్థిక సుస్థిరతను పెంపొందించుకుని ఉపాధి కల్పించే పారిశ్రామికవేత్తలుగా ఎదిగే విధంగా ముందుకు రావాలని కోరారు.

దాతలు ముందుకు రావాలి

ప్రజాశక్తి - శ్రీకాకుళం

క్షయ (టిబి) రోగులకు నిరంతరం ఆహారం అందించడానికి దాతలు ముందుకు రావాలని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ పిలుపునిచ్చారు. నగరంలోని బాపూజీ కళామందిర్‌లో రెడ్‌క్రాస్ ఆధ్వర్యాన శుక్రవారం నిర్వహించిన క్షయ వ్యాధి నివారణ, పౌష్టికాహారం పంపిణీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. టిబి రోగులకు భోజన ఏర్పాట్లకు స్వచ్ఛంద సంస్థల ద్వారా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పరిశ్రమలు, కార్పొరేట్ సంస్థలు, ఇతర దాతలు మరింత ముందుకు వస్తే ప్రస్తుతం అందిస్తున్న ఆరు నెలలే కాకుండా నిరంతరం కొనసాగించవచ్చని అభిప్రాయపడ్డారు. రక్త సేకరణకు, విద్యార్థుల రక్త గ్రూపును తెలుసుకునేందుకు కళాశాలల్లో పరీక్షలు చేయాలని సూచించారు. రక్తదానానికి విద్యార్థులు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. రెడ్‌క్రాస్ ద్వారా హాస్పిటల్ ఏర్పాటుకు అందరూ సహకరించాలని కోరారు.

అదనపు జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి ఎన్.అనురాధ మాట్లాడుతూ జిల్లాలో తొమ్మిది టిబి వ్యాధి నిర్ధారణ కేంద్రాలు ఉన్నాయని తెలిపారు. వ్యాధి నిర్ధారణ అయితే ప్రభుత్వం ఉచితంగా మందులు అందజేస్తుందన్నారు. పలు సంస్థలు ఇచ్చిన విరాళాలను రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్, కలెక్టర్‌కు అందజేశారు. ఆయా రంగాల్లో సేవలు అందించిన జిల్లా అధికారులకు, దాతలకు ఘనంగా సత్కరించారు. స్వచ్ఛంద సంస్థలు, దాతలు అందించిన రగ్గులు, పౌష్టికాహారం తదితర వాటిని రోగులకు అందించారు. కార్యక్రమంలో జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి బి.మీనాక్షి, రెడ్‌క్రాస్ జిల్లా అధ్యక్షులు జగన్మోహనరావు, జిల్లా అటవీశాఖ అధికారి నిషా కుమారి, డిఇఒ జి.పగడాలమ్మ, సమగ్ర శిక్ష ఎపిసి జయప్రకాష్, పలువురు అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

మహిళలపై అసమానతలు తొలగించాలి

జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

మహిళలపై అసమానతలు తొలగించాలని జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ అన్నారు. మహిళలపై వేధింపుల నివారణ పక్షోత్సవాలు ముగింపు కార్యక్రమాన్ని జెడ్‌పి సమావేశ మందిరంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలపై వేధింపులకు పాల్పడితే ఫిర్యాదు చేయాలని సూచించారు. మహిళలతో అసభ్యకరంగా ప్రవర్తిస్తే ఎంతటి స్థాయిలో శిక్ష ఉంటుందో తెలియజేయాలన్నారు. సమాజంలో లింగ వివక్షకు శాశ్వతంగా ముగింపు పలికాలన్నారు. మహిళా హక్కులు, సాధికారతపై ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిటీ సభ్యులు జి.సీతారాం కొనియాడారు. దిశ పోలీస్‌స్టేషన్ డిఎస్‌పి వాసుదేవరావు మాట్లాడుతూ మహిళలపై ఎలాంటి వేధింపులైనా పోక్సో చట్ట ప్రకారం కేసు నమోదు చేయొచ్చని చెప్పారు.

మహిళా శిశు సంక్షేమ శాఖ పీడీ అనంతలక్ష్మి మాట్లాడుతూ పని ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపుల నివారణపై గత నెల 25 నుంచి ఈనెల తొమ్మిదో తేదీ వరకు పక్షోత్సవాలను నిర్వహించినట్లు తెలిపారు. అనంతరం మహిళా హక్కులపై పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సిడబ్ల్యు అధ్యక్షులు శ్రీలక్ష్మి, లక్ష్మీ కుమారి, సిడిపిఒలు, సూపర్‌వైజర్లు, ఆయా శాఖల ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ నవీన్

రణస్థలం ఐసిడిఎస్‌లోనే కొనసాగించాలి

సిఐటియు జిల్లా అధ్యక్షులు అమ్మన్నాయుడు

ప్రజాశక్తి - రణస్థలం


ఎమ్మెల్యేకు వినతిపత్రం అందిస్తున్న అంగన్వాడీలు

లావేరు మండలంలోని అంగన్వాడీ కేంద్రాలను రణస్థలం ఐసిడిఎస్ ప్రాజెక్టులోనే కొనసాగించాలని, వారి సమస్యలు పరిష్కరించాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్ అమ్మన్నాయుడు డిమాండ్ చేశారు. శుక్రవారం అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రణస్థలం ప్రాజెక్టు అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి ఆర్.అప్పమ్మ, కె.సుజాత ఆధ్వర్యాన ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్‌ను ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కలిసి, వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 20 ఏళ్లుగా లావేరు మండలంలోని అంగన్వాడీ కేంద్రాలు రణస్థలం ప్రాజెక్టులో కొనసాగుతున్నాయని చెప్పారు. ఇతర ప్రాజెక్టు పరిధిలో కల్పించడం, యథా స్థానంలో కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యకర్తలు సమావేశాలకు హాజరు కావడానికి రణస్థలం అందుబాటులో ఉందని అన్నారు. అంగన్వాడీ కేంద్రాల అద్దె బిల్లులు, టిఎ, డిఎ బిల్లులు చెల్లించేలా కృషి చేయాలని కోరారు. వినతిపత్రం అందించిన వారిలో ఎన్.వెంకటలక్ష్మి, పి.దేవి, బి.రాధ, తదితరులు ఉన్నారు.

అరసవల్లి సందర్శన

ప్రజాశక్తి-శ్రీకాకుళం అర్బన్

అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయాన్ని పలువురు ప్రముఖులు సందర్శించారు. శుక్రవారం రాష్ట్ర టెక్నికల్ అండ్ అకౌంట్స్ డైరెక్టర్ డి. సురేంద్ర, ఏలూరు జిల్లా వెంకటరమన్న గూడెం పశుసంవర్ధక శాఖ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టరు కంచరాన ఆనందరావు, విశాఖలోని శ్రీవిద్యాపీఠం నుంచి శంకర విద్యానంద సరస్వతి, తదితరులు సందర్శించారు. వారికి ఆలయ మర్యాదలతో అర్చకులు స్వాగతించారు. ఆలయం స్వామివారికి పలు సేవలు నిర్వహించిన అనంతరం శేష వస్త్రాలను కప్పి స్వామివారి జ్ఞాపికలను అందజేశారు. ఆలయ ఇఒ. వి.హరి సూర్యప్రకాష్, సూపరింటెండెంట్ కె.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గణతంత్ర వేడుకలకు సిక్కోలు నృత్యకారులు

ప్రజాశక్తి-శ్రీకాకుళం అర్బన్

కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న వందే భారతం నృత్యోత్సవ్ గణతంత్ర దినోత్సవ వేడుకల పరేడ్ పోటీలకు సిక్కోలుకు చెందిన నృత్యకారులు ఎంపికయ్యారు. జిల్లా, రాష్ట్ర స్థాయిలో తమ ప్రతిభా పాటవాలను చాటుకున్న వీరు జాతీయస్థాయిలో ఎంపికై గణతంత్ర వేడుకల పరేడ్లో పాల్గొంటారు. దేశంలో వున్న ప్రతిభావంతులైన కళాకారుల ఎంపిక ప్రక్రియ మూడు విభాగాల్లో జిల్లాల వారీగా, రాష్ట్రాల వారీగా, అంతర్రాష్ట్రాల వారీగా జరిగింది. 2023 జనవరి 26న గణతంత్ర వేడుకల్లో జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించేందుకు వేదిక నృత్య కళా నికేతన్ వ్యవస్థాపకులు మెహెర్ ప్రభాకర్ శిష్య బృందం సంధ్యశ్రీ, ప్రతీక అనూరాధ, సంహిత, లక్ష్మీప్రసన్న, బెహరా ప్రీతి, వాసంతి రాష్ట్రస్థాయి, జోనల్ స్థాయిలో ఎంపికై ఈనెల 18న ఢిల్లీలో నిర్వహించే జాతీయస్థాయి పోటీలకు హాజరు కానున్నట్లు ప్రభాకర్ తెలిపారు.

గ్రంథాలయ సమస్యలపై వినతి


వినతిపత్రం అందిస్తున్న పాఠకులు

ఇచ్ఛాపురం : ఇచ్ఛాపురం మున్సిపాలిటీలోని శ్రీ రామకృష్ణ రీడింగ్‌రూం లైబ్రరీకి సంబంధించిన పలు సమస్యలను పరిష్కరించాలని మున్సిపల్ కమిషనర్ రమేష్, చైర్‌పర్సన్ రాజ్యలక్ష్మికి శుక్రవారం కోరారు. ఈ మేరకు వారికి వినతిపత్రం అందించారు. లైబ్రరీలో అన్ని వార్తా పత్రికలు పాఠకులకు అందుబాటులో ఉండేలా చూడాలని, పోటీ పరీక్షల మ్యాగజైన్లు, పుస్తకాలు, నీతి కథలు, వైజ్ఞానిక అంశాలకు సంబంధించిన వార, మాస పత్రికలు అందుబాటులోకి తేవాలని కోరారు. తాగునీటి సదుపాయంతో పాటు, చిన్న చిన్న మరమ్మతులు చేయాలని కోరారు. వినతిపత్రం అందించిన వారిలో ఏలియన్స్ సంస్థ అధ్యక్షులు ఎల్.నరసింహమూర్తి, కార్యదర్శి లక్ష్మణరావు, సత్యమూర్తి, పిఆర్‌ఓ దక్షత గోపీనాథ్, సభ్యులు, విశ్రాంత ఉపాధ్యాయులు, పాఠకులు ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

సచివాలయ ఉద్యోగుల సంఘం

రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా 'కూన'

ప్రజాశక్తి - ఆమదాలవలస



ఆంధ్రప్రదేశ్ గ్రామ వార్డు సచివాలయ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కూన వెంకట సత్యనారాయణను గుంటూరులో ఎన్నుకున్నారు. ఆయన మండలంలోని చీమలవలస గ్రామ సచివాలయంలో వెల్ఫేర్ సెక్రెటరీగా విధులు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో రెండున్నర సంవత్సరాలుగా ఉద్యోగుల సంక్షేమం కోసం పోరాడుతున్నామని తెలిపారు. సచివాలయ ఉద్యోగులకు 010 ఖాతాల ద్వారా జీతభత్యాలు, సిపిఎస్ పరీక్షలు రద్దు చేయడం, కారుణ్య నియామకాలు, తదితర అంశాలను సంఘం గౌరవాధ్యక్షులు కె.ఆర్ సూర్యనారాయణ ఆధ్వర్యంలో సాధించుకున్నామని తెలిపారు. రాబోయే రోజుల్లో సచివాలయ ఉద్యోగుల కుటుంబాలకు రేషన్ కార్డులు, ఆరోగ్య భద్రత కార్డులు కల్పించేలా కృషి చేస్తానని తెలిపారు. ఉద్యోగులందరూ ఐక్యమత్యంగా ఉండాలని కోరారు. ఉద్యోగుల సమస్య పరిష్కారానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర గౌరవ అధ్యక్షులు కె.ఆర్ సూర్యనారాయణ, రాష్ట్ర అధ్యక్షులు షేక్‌బ్బల్ రజాక్‌కు ధన్యవాదాలు తెలిపారు.

ఆరుతడి పంటలకు విత్తనాలు

నందిగాం: ఖరీఫ్ సీజన్‌లో ఆరుతడి పంటలుగా వేసే వేరుశనగ, పెసర, మినుము విత్తనాలను రైతు భరోసా కేంద్రాల ద్వారా అందిస్తున్నామని వీటిని రైతులు వినియోగించుకోవాలని మండల వ్యవసాయ అధికారి శ్రీకాంత్ వర్మ అన్నారు. శుక్రవారం సాయంత్రం నందిగాం వన్ రైతు భరోసా కేంద్రంలో సలహా మండలి సమావేశం జరిగింది. సమావేశంలో పిఎసిఎస్ అధ్యక్షులు కె.బాలకృష్ణారావు, సర్పంచ్ భైరాగి, తహశీల్దార్ ఎం.సుధారాణి, తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభానికి సిద్ధం చేయాలి : డీఎల్‌డిఒ

'ప్రజాశక్తి' వార్తకు స్పందన

ప్రజాశక్తి - సంతబొమ్మాళి


ఆర్‌బికెను పరిశీలిస్తున్న అలివేలుమంగమ్మ

ఈ నెల 3 తేదీన ప్రారంభం కాని ఆర్‌బికెలు అని ప్రజాశక్తిలో వచ్చిన వార్తకు అధికారులు స్పందించారు. టెక్కలి డిఎల్‌డిఒ అలివేలు మంగమ్మ శుక్రవారం సంతబొమ్మాళి ఆర్‌బికె-1, 2లను పరిశీలించారు. త్వరగా ఆర్‌బికెలను ప్రారంభానికి సిద్ధం చేయాలని ఎంపిడిఒ ఉమా సుందరిని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బిల్లులు చెల్లించినప్పటికీ ఆర్‌బికెలు ఎందుకు ప్రారంభించలేదని, సచివాలయాలు పనులు మధ్యలో ఎందుకు ఆపేశారని విషయంపై కాంట్రాక్టరుతో సమావేశం ఏర్పాటు చేసి, చర్యలు తీసుకోవాలని ఎంపిడిఒను ఆదేశించారు. కార్యక్రమంలో సర్పంచ్ కె.లక్ష్మి, ఎంపిడిఒ జి.ఉమసుందరి, పంచాయతీ కార్యదర్శి ఎస్.మల్లేశ్వరరావు, ఇంజినీరింగ్ అసిస్టెంట్ రూప్సీ పాల్గొన్నారు.

వరి కోతలు వాయిదా వేయండి

బూర్జ: బంగాళాఖాతంలో ఏర్పడిన మాండస్ తుపాను ప్రభావంతో వర్షాలు కురుస్తున్న కారణంగా వరి కోతలు తాత్కాలికంగా నిలిపివేయాలని ఎఒ రాజేశ్వరరావు కోరారు. శుక్రవారం బూర్జ, వావం, మామిడివలస కళ్లాల్లో రైతులను కలిసి అవగాహన కల్పించారు. కోసిన పంటను వెంటనే కుప్పలు పెట్టాలని, లేకుంటే రైతులకు తీవ్ర నష్టం వాటిల్లే పరిస్థితి ఉందన్నారు.

భూ హక్కు పత్రాల పంపిణీ


భూ హక్కు పత్రాలతో రైతులు

మెళియాపుట్టి: మండలంలోని బాణాపురం గ్రామ పంచాయతీలో వైఎస్‌ఆర్ జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష హక్కు పత్రాలను రైతులకు వైస్ ఎంపిపి నవర ఆదినారాయణ, బాణాపురం సర్పంచ్ పెద్దింటి చంద్రరావు శుక్రవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

మానవ హక్కుల ఉల్లంఘనకు తావివ్వద్దు

ప్రజాశక్తి-శ్రీకాకుళం అర్బన్



సమాజంలోని పౌరుల హక్కులకు ఎటువంటి ఉల్లంఘనకు తావు లేకుండా స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతత్వం ప్రతి పౌరునికి అందేలా కృషి జరగాలని సంయుక్త కలెక్టర్ యం.నవీన్ పిలుపు నిచ్చారు. జిల్లా స్థాయి డిబేట్ ఆబ్జెక్టివ్ పోటీ పరీక్ష లను ప్రభుత్వ కళాశాల సిల్వర్ జూబ్లీ హాలులో ఆయన శుక్రవారం ప్రారంభించారు. ఈకార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సమాజంలో మానవ హక్కులు ప్రతి ఒక్కరికీ అవసరమన్నారు. ఇప్పటికీ కొన్ని చోట్ల మానవ హక్కుల ఉల్లంఘన జరుగుతూనే ఉందని, దీనికి అణగారిన, వెనుకబడిన వర్గాల కుటుంబాల పట్ల అసమానతలే కారణమన్నారు. ఈధోరణి ప్రతి ఒక్కరిలో పోవాలని, ఆ దిశగా అడుగులు వేయాలన్నారు. మానవ హక్కులపై జిల్లా స్థాయిలో వివిధ పోటీలను నిర్వహించుకోవడం గర్వకారణమన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డా. పి.సురేఖ, సామాజిక సంఘ సేవకులు నటుకుల మోహన్, డా. బి.దేవభూషణరావు, కేంద్ర మానవ హక్కుల సంఘం రాష్ట్ర సమన్వయకర్త జి.దుర్గాప్రసాద్, రాష్ట్ర అధ్యక్షులు బి.నర్సింగరావు, రాష్ట్ర సీనియర్ ఉపాధ్యక్షులు డి.లవకుమార్, రాష్ట్ర చీఫ్ ఉపాధ్యక్షులు బి.విజయకుమార్, విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

అర్హులకే పథకాలు

మంత్రి సీదిరి అప్పలరాజు


మహిళకు కరపత్రం అందిస్తున్న మంత్రి సీదిరి అప్పలరాజు

ప్రజాశక్తి - పలాస

అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామని, పార్టీలకతీతంగా నిజమైన లబ్ధిదారులకు పథకాలు అందించి ఆదుకుంటున్నామని రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి సీదిరి అప్పలరాజు అన్నారు. మండలంలోని తర్లాకోట పంచాయతీ పరిధిలోని కైజోల, కొత్తూరు, దానగోర, హిమగిరి, సిరిపురం గ్రామాల్లో శుక్రవారం సాయంత్రం గడప గడపకు వైసిపి నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలు అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. ముందుగా మంత్రి అప్పలరాజుకు వైసిపి నాయకులు, కార్యకర్తలు, మహిళలు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరైనా అర్హత ఉండి సంక్షేమ పథకాలు రాకపోతే వారికి ఇప్పించే బాధ్యత తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో తర్లకోట సర్పంచ్ కొర్ల శివకృష్ణ, పలా ఎంపిపి ఉంగ ప్రవీణ, వైసిపి నాయకులు ఉంగ సాయికృష్ణ, ధనరాజ్, చైర్మన్ బల్ల గిరిబాబు, దువ్వాడ వామాక్షి, రవికుమార్, మాధవరావు, జి.వేణుగోపాల్, మోహనరావు, షణ్ముఖ, పాపారావు, లక్ష్మణ్, దానయ్య, కిషోర్, ధర్మారావు, శ్రీరాములు, తిరుమలరావు, మధుసూదన్‌రావు, రమేష్‌నాయుడు, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వానికి ఖర్చు తప్ప పచ్చదనం ఏదీ?

ప్రజాశక్తి - రణస్థలం రూరల్

ఉపాధి హామీ చట్టంలో భాగంగా గత ఏడాది ఉపాధి హామీ పథకం ద్వారా నాటినటువంటి మొక్కలన్నీ నిర్వాహణ లోపం కారణంగా చనిపోయాయని, ఏటా ప్రభుత్వానికి ఖర్చు తప్ప, పచ్చదనం ఏదని సోషల్ ఆడిట్ తనిఖీ బృందాలు ప్రశ్నించాయి. శుక్రవారం ఎంపిడిఒ కార్యాలయ ఆవరణలో ఎపిడి స్వరూపారాణి ఆధ్వర్యాన ప్రజావేదిక నిర్వహించారు. గత ఏడాది రూ.58 కోట్లతో చేపట్టిన ఉపాధి హామీ పనులపై ఆడిట్ నిర్వహించారు. గ్రామాల్లో జరిగిన పనుల పనితీరు, ఖర్చులు నిర్వహణను వివరించారు. రికార్డులు, మస్తరు కార్డులు దిద్దుబాట్లు కారణంగా రూ.2300లు అపరాధ రుసుం విధించారు. ఎంపిపి ప్రతినిధి పిన్నింటి సాయికుమార్ మాట్లాడుతూ ఉపాధి హామీ పనులు మరింత ఎక్కువగా చేపట్టి గ్రామాల్లో ఉపాధి హామీ కూలీలకు మెరుగైన ఉపాధిని అందించాలని సూచించారు. ఎంపిపి ప్రతినిది మైలపల్లి కామరాజు మాట్లాడుతూ మత్స్యకారులకు ఉపాధి హామీ పనులు ప్రభుత్వం అందించినప్పటికీ తీర ప్రాంతాలలో ఇసుక ప్రాంతం కావడం వల్ల కొన్ని ఇబ్బందులు ఎదురవుతున్నాయని, వాటిని అధిగమించేలా మార్పులు చేసి ఉపాధి హామీ పనులు మత్స్యకారులు కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి రాయపరెడ్డి భుజంగరావు, ఎపిఎం శ్రీనివాస్‌నాయుడు, ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు, సామాజిక తనిఖీ బృందాలు, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.


సామాజిక తనిఖీలో అధికారులు

మహిళా సాధికారితతోనే అభివృద్ధి

ప్రజాశక్తి - పొందూరు


మాట్లాడుతున్న వరప్రసాద్

మహిళా సాధికారితతోనే అభివృద్ధి సాధ్యమని నాబార్డు జిల్లా అభివృద్ధి మేనేజర్ కుప్పిలి వరప్రసాద్ అన్నారు. శుక్రవారం పొందూరు పట్టణంలోని మేదరవీధిలో బెజ్జిపురం యూత్‌క్లబ్ అధ్యక్షులు ఎం.ప్రసాదరావు ఆధ్వర్యాన 14 రోజులుగా వెదురుతో గృహోపకరణాల తయారీపై నిర్వహిస్తున్న శిక్షన శుక్రవారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా పరిపుష్టిని సాధించడానికి ఇటువంటి శిక్షణలు ఎంతగానో ఉపయోగపడుతుందని దీన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. లీడ్‌బ్యాంకు జిల్లా ప్రతినిధి కె.గిరిజాశంకర్ ఆర్థిక అక్షరాస్యత, ఆర్థిక క్రమశిక్షణ, సైబర్ నేరాల అరికట్టడం వంటి పలు విషయాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా 14 రోజుల శిక్షణలో మహిళలు వెదురుతో తయారు చేసిన 20 రకాల గృహోపకరణాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో జిల్లా కేంద్ర సహకార బ్యాంకు పొందూరు బ్రాంచ్ మేనేజర్ వి.ప్రసూనకుమారి, వైఎస్ఆర్ క్రాంతి పథం ఏపీఎం గురుగుబెల్లి శ్యామలరావు, బెజ్జిపురం యూత్‌క్లబ్ కోశాధికారి జి.అప్పలనాయుడు, శిక్షకులు గణేష్ అప్పారావు, సిబ్బంది ఎన్.శ్రీనివాసరావు, శ్రావణి, అనూరాధ, లక్ష్మణరావు, మేదర్ల సంఘం అధ్యక్షులు కోళ్ల పరుశరాం, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీపై అవగాహన

ప్రజాశక్తి - ఇచ్ఛాపురం

మండలంలోని ఉపాధి హామీ చట్టం కింద చేపట్టాల్సిన వివిధ పనులపై ఎంపిపి బి.పుష్ప ప్రజాప్రతినిధులకు శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ అవగాహన తప్పనిసరి అని అన్నారు. జెడ్‌పిటిసి ఉప్పాడ నారాయణమ్మ, ఎపిఒ భాస్కరరావు, కె.మోహన్‌రావు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

'క్లీన్ ఆంధ్రా'పై అవగాహన కల్పించాలి

ప్రజాశక్తి -ఇచ్ఛాపురం

క్లీన్ ఆంధ్రప్రదేశ్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ రాజ్యలక్ష్మి సూచించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి సమక్షంలో రీ సర్వే, క్లాప్‌పై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనరు మాట్లాడుతూ ఏడు రోజుల క్లీన్ ఆంధ్రప్రదేవ్ వీక్లీ యాక్షన్ ప్లాన్‌లో అందరూ భాగస్వాములు కావాలన్నారు. ప్రతి సచివాలయం పరిధిలో ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. పారిశుధ్యంపై ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన లేదని అన్నారు. చైర్‌పర్సన్ రాజ్యలక్ష్మి మాట్లాడుతూ తడి, పొడి చెత్తపై అర్‌పిలు అందరూ ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. ప్రతి ఇంటికీ మూడు రకాల డస్ట్ బిన్లు పంపిణీ చేశారని, చెత్త నుంచి మున్సిపాలిటీకి ఆదాయం సమకూరేలా చర్యలు తీసుకోవాలన్నారు. జగన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకాన్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని అన్నారు. రీ సర్వేకి సహకరించేలా అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ అధికారి నారాయణరావు, సిఎం ఎం.జానకిరావు, సిఒ సంతోష్, బాలరాజు, సచివాలయ సిబ్బంది, అర్‌పిలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రాజ్యలక్ష్మి

రోడ్డు ప్రమాదాలను నివారించాలి

డిఎస్‌పి శివరామిరెడ్డి

పజాశక్తి - జలుమూరు

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని డిఎస్‌పి శివరామిరెడ్డి అన్నారు. జలుమూరు పోలీస్ స్టేషన్‌ను శుక్రవారం సందర్శించి తనిఖీలు చేశారు. ఆ సందర్భంగా సిబ్బందికి సూచనలు చేశారు. రోడ్డు ప్రమాదం నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. స్టేషన్ పరిధిలో నమోదైన కేసులు సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే దిశ యాప్‌పై పూర్తి స్థాయి అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. అక్రమంగా గుట్కా, ఖైనీ, మద్యం రవాణపై ప్రత్యేక దృష్టిపెట్టాలన్నారు. పశువుల అక్రమ రవాణాను నిరోధించాలన్నారు. ఆయనతోపాటు నరసన్నపేట సిఐ రాము, ఎస్ఐ పి.పారినాయుడు. సిబ్బంది ఉన్నారు.


రికార్డులను పరిశీలిస్తున్న డిఎస్‌పి శివరామిరెడ్డి

బూర్జ: వాహన చోదకులు వేగాన్ని తగ్గించి ప్రమాదాలను అరికట్టాలని ఎస్ఐ అశోక్‌బాబు అన్నారు. శుక్రవారం మండలంలోని ఉప్పినివలస, కె.కె.రాజపురం, కొల్లివలస, మధనాపురం, బూర్జ, తదితర కూడళ్లలో వాహన చోదకులకు అవగాహన కల్పిస్తూ బ్యానర్లు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యం సేవించి, సెల్ ఫోన్లో మాట్లాడుతూ వాహనాలు నడపటం వల్ల ప్రమాదాలు పెరుగుతున్నాయని, వీటి నివారణకు సహకరించాలని అన్నారు. ప్రమాదంలో మరణించిన వారి కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని చెప్పారు.

జి.సిగడాం: మండల కేంద్రంలో ప్రజలకు రోడ్డు ప్రమాదాల నివారణపై ఎస్ఐ సామంతుల రామారావు అవగాహన కల్పించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అత్యసవర సేవలకు పోలీసులు ఎప్పుడూ అందుబాటులో ఉంటారని అన్నారు. కార్యక్రమంలో జి.సిగడాం పిఎస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.


సోంపేట: ప్రాజెక్టుపై అవగాహన కల్పిస్తూ..

కొత్తూరు: రోడ్డు ప్రమాదాలకు గురికాకుండా వాహనదారులు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ ఎం.గోవింద్ అన్నారు. శ్రీకాకుళం రోడ్డు మెట్టూరు నుంచి పారాపురం వరకు పలు మలుపుల వద్ద జంగిల్ క్లియరెన్స్‌ను జెసిబితో చేపట్టారు. ప్రమాదాలు జరిగే చోట హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. తరచూ ప్రమాదాలకు కారణమవుతున్న చెట్ల తొలగింపునకు కలెక్టర్, ఆర్అండ్‌బి అధికారులకు రాత పూర్వకంగా లేఖ రాస్తున్నట్లు ఎస్ఐ చెప్పారు.

సోంపేట: రోడ్డు ప్రమాదాల నివారణ, సైబర్ నేరాలపై అప్రమత్తత కలిగి ఉండాలని సోంపేట సిఐ రవిప్రసాద్ అన్నారు. కొర్లం జాతీయ రహదారి వద్ద శుక్రవారం రాత్రి ప్రొజెక్టర్‌పై ప్రదర్శన ఇస్తూ అవగాహన కల్పించారు. రోడ్డు ప్రమాదాలు జరగడానికి గల కారణాలు, వాటి నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బారువ ఎస్ఐ వి.సత్యనారాయణ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రామశేషు హత్య కేసును ఛేదించాలి

ప్రజాశక్తి-శ్రీకాకుళం అర్బన్

జిల్లాలో సంచలనం సృష్టించిన బరాటం రామశేషు హత్య కేసును పోలీసులు ఛేదించాలని కళింగ కోమటి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కోణార్క్ శ్రీను కోరారు. కళింగ కోమటి భవనంలో శుక్రవారం జరిగిన కార్యవర్గ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కళింగ కోమటి కుల ఐక్యత కోసం రాజకీయాలు, గ్రూపులు, వర్గాలకు అతీతంగా కలిసి పనిచేయాలని కోరారు. రామశేషు హత్య సామాన్యుడి నుండి పెద్దల వరకు అందరినీ కలచివేసిందని, ఇటువంటి సంఘటనలు భయాన్ని సృష్టించాయని పేర్కొన్నారు. ఈనెల 11న నగరంలో కళింగ కోమటి కళ్యాణ మండపం నుంచి పొట్టి శ్రీరాములు జంక్షన్ వరకు మౌన ప్రదర్శన నిర్వహించి, సంతాపం తెలియజేయాలని పిలుపు నిచ్చారు. ప్రతి ఒక్కరూ తెల్ల చొక్కా ధరించి నల్ల బ్యాడ్జిలు పెట్టుకుని ఈ ప్రదర్శనలో పాల్గొనాలన్నారు. సమావేశంలో తంగుడు జోగారావు, బోయిన గోవిందరాజులు, కోరాడ సర్వేశ్వరరావు, ఊన్న నాగరాజు, సీతాప్రసాద్, పివి.రమణ, కోరాడ హరగోపాల్, కోరాడ రమేష్, తంగుడు నాగేశ్వరరావు, వైశ్యరాజు మోహన్, గుడ్ల దామోదర్, బరాటం చంద్ర, నవత బాబ్జీ, తదితరులు పాల్గొన్నారు.

108తో మెరుగైన వైద్య సేవలు

ప్రజాశక్తి-రణస్థలం

ప్రజలకు ఆరోగ్యవంతమైన మెరుగైన సేవలు మరింత అందించేందుకు 108 వాహనాలను అందుబాటులో ఉంచుతున్నామని, 108 వాహనాల జిల్లా మేనేజర్ నజీర్ అన్నారు. మండల కేంద్రంలోని 108 వాహనాన్ని ఆయన శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వాహనంలో ఉన్నటువంటి అత్యవసర వైద్య పరికరాలైన ఆక్సిజన్, ప్రథమ చికిత్స కిట్లు, మిగతా పరికరాల పనితీరు అత్యవసర పరికరాల నిర్వహణను పరిశీలించారు. వాహనం నిర్వహణ, తదితర అంశాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం వైద్యానికి అధిక ప్రాధాన్యతనిస్తోందన్నారు. ఈ నేపథ్యంలో మెరుగైన నాణ్యమైన సేవలు అందించేందుకు ఎప్పటికప్పుడు వాహనాలు పరిశీలిస్తున్నామని తెలిపారు ఈ పరిశీలనలో 108 సిబ్బంది పాల్గొన్నారు.


108 వాహనం తనిఖీ చేస్తున్న జిల్లా మేనేజర్ నజీర్

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతకు సన్మానం

ప్రజాశక్తి - సంతబొమ్మాళి

మండలంలోని బోరుభద్ర నుండి రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయునిగా ఎంపికైన బాడాన రాజును హెచ్‌ఎం టి.వి.రమణమూర్తి, సిబ్బంది శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం రమణమూర్తి మాట్లాడుతూ రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా బోరుభద్ర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన బాడాన రాజు రాష్ట్ర ఉత్తమ సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయ అవార్డు పొందడం ఈ ప్రాంతానికే గర్వకారణం అని అన్నారు. రాష్ట్ర స్థాయిలో అరుదైన గౌరవం పొందడం ద్వారా రాజు పాఠశాల కీర్తి ప్రతిష్టలు ఇనుమడింపజేశారన్నారు. కృషి, పట్టుదలతో అతి సామాన్య స్థాయి నుండి అత్యున్నత స్థాయికి ఎదిగిన రాజుని విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. వినూత్న బోధనా పద్ధతులతో విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో సాంఘిక శాస్త్రాన్ని బోధించడంలో రాజు దిట్ట అని ఆయన ప్రశంసించారు. సహచర ఉపాధ్యాయులు మాట్లాడుతూ ఉపాధ్యాయ సంఘ నాయకునిగా ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంలో , విద్యారంగ పరిరక్షణకు రాజు చేస్తున్న కృషి అనిర్వచనీయమన్నారు. భవిష్యత్‌లో రాజు మరెన్నో అవార్డులు సాధించాలని వారు ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పి.తిరుపతిరావు, టి.లోకేశ్వరరావు, బి.తాతారావు, వెంకటరెడ్డి, బి.లక్ష్మణరావు, కృష్ణారావు, పి.ఎర్రయ్య, బి.శాంతారావు, పి.అప్పలరాజు, కె.తవిటరెడ్డి, డి.ఉమాదేవి, కె.రమణమ్మ, టి.విజయలక్ష్మి, బి.నాగమణి, గోపాలరెడ్డి, శంకరరావు, సిఆర్‌పి కృష్ణారావు, తదితరులు పాల్గొన్నారు.


బాడాన రాజును సన్మానిస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

విద్యా విధానంలో మరిన్ని సంస్కరణలు


ప్రజాశక్తి - టెక్కలి రూరల్

విద్యా విధానంలో మరిన్ని సంస్కరణలు తీసుకురావాలని ఆచార్య నాగార్జున యూనివర్శిటీ ఇంజినీరింగ్ కళాశాల అకడమిక్ డీన్, ప్రొఫెసర్ శ్రీనివాసరెడ్డి అభిప్రాయపడ్డారు. టెక్కలి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో ఇండియన్ సొసైటీ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (ఐఎస్టిఈ) సంయుక్తంగా 'నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ 2020 చాలెంజెస్ అండ్ ప్రాస్పెక్ట్స్' అనే అంశంపై శుక్రవారం సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 75 ఏళ్ల స్వతంత్ర భారతంలో విద్యపై 4 సవరణలు మాత్రమే జరగడం బాధాకరమన్నారు. తలసరి ఆదాయంలో విద్యకు 3శాతం మాత్రమే ప్రభుత్వాలు కేటాయిస్తున్నాయని ఆవేదన చెందారు. మరిన్ని సంస్కరణలు చేపట్టి నాణ్యమైన విద్యను ప్రజలందరికీ అందేలా చూడాల్సిన తరుణం ఏర్పడిందన్నారు. విశాఖ జివిపి మహిళా ఇంజినీరింగ్ కళాశాల సీనియర్ ప్రొఫెసర్ డాక్టర్ ఎన్.బి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రభుత్వాలు, విద్యాసంస్థలు, అధ్యాపకులు నాణ్యమైన విద్యను అందించుటకు సమిష్టిగా కృషి చేయాలన్నారు. మార్కుల కోసం, సర్టిఫికేట్ల కోసమే విద్య అన్న భావన నుండి విద్య ఉపాధి కల్పనుకు, వ్యక్తిలో సంస్కరణ పెంచేందుకు పాటు పడాలన్నారు. ఐతమ్ డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరరావు మాట్లాడుతూ ఇప్పటికే యుజిసి, ఎఐసిటిఇ, రాష్ట్ర ఉన్నత విద్యామండలి విద్యాభివృద్ధికి అనేక సంస్కరణలు తీసుకొచ్చిందన్నారు. అటానమస్ విధానం అమలులో ఉండడం వల్ల ఎప్పటికప్పుడు సిలబస్‌ను మార్చుకొనే వీలుందన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, సదస్సు కో-ఆర్డినేటర్ డాక్టర్ జి.నాగేశ్వరరావు, సహాయ కో-ఆర్డినేటర్ డాక్టర్ బి.రమేష్‌నాయుడు, డాక్టర్ శ్రీనివాస్ ఆచార్యులు, పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు.



స్టాంపు గ్రిడ్ టెక్నాలజీతో 'అమరాన్'

ప్రజాశక్తి-శ్రీకాకుళం అర్బన్



దేశంలో అత్యధిక వారంటీతో, వేగవంతమైన సేవలతో శరవేగంగా అమరాన్ అడ్వాన్స్‌డ్ స్టాంపు గ్రిడ్ టెక్నాలజీని (ఎ.ఎస్.జి) ప్రవేశపెట్టిందని అమర్‌రాజా బ్యాటరీ కంపెనీ సెంట్రల్ రీజనల్ మేనేజర్ నారా చెంగలరావు నాయుడు వెల్లడించారు. నగరంలోని గ్రాండ్ హోటల్‌లో శుక్రవారం నిర్వహించిన అమరాన్ జిల్లా డీలర్ల వార్షిక సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఎఎస్‌జి టెక్నాలజీ వల్ల 30 శాతం బ్యాటరీ జీవిత కాలం పెరుగుతోందని తెలిపారు. దీనివల్ల వినియోగదారులకు అత్యధికంగా 72 నెలల వారంటీ ఇవ్వగలుగుతున్నామని చెప్పారు. అంతర్జాతీయ మార్కెట్‌లో 34 దేశాలకు 70 శాతం ఎగుమతి దేశం నుంచి చేస్తున్నట్టు తెలిపారు. దేశంలోని అమ్మే ఆటోమోటివ్ బ్యాటరీలలో రెండో అతి పెద్ద కంపెనీగా నిలిచిందన్నారు. కంపెనీ ఆంధ్రప్రదేశ్ బ్రాంచ్ మేనేజర్ కె.శ్రీనివాస రావు మాట్లాడుతూ ప్రగతిని, టెక్నాలజీని వివరించారు. కంపెనీ రాష్ట్ర సర్వీసు మేనేజర్ నాగుల్ అజాద్ మాట్లాడుతూ, సర్వీసు పరంగా అనేక మార్పులు వస్తున్నాయని, అన్నింటిని ఫోన్ లోనే చూడవచ్చన్నారు. అన్ లైన్ వారంటీ రిజిస్ట్రేషన్ విధానం కూడా అమలవుతుందన్నారు. జిల్లా బ్యాటరీ వర్తక సంఘం అధ్యక్షులు, కిరణ్ ఆటోమొబైల్స్ అధినేత బి వి రవిశంకర్ మాట్లాడుతూ సంస్థ ద్వారా కొనుగోలు చేయడమంటే, సామాజిక కార్యక్రమాల్లో బాగస్తులు కావడమే అన్నారు. సంస్థకు వచ్చే ఆదాయంలో 30 శాతం స్వచ్ఛంద కార్యక్రమాలు వినియోగిస్తామన్నారు. వివిధ కేటగిరిల్లో గెలుపొందిన డీలర్లకు అవార్డులను అందజేశారు.


మనోహర్‌కు స్వాగతం పలుకుతున్న జనసేన నాయకులు

12న యువభేరి

శ్రీకాకుళం అర్బన్: జనసేన నాయకులు నాదెండ్ల మనోహర్ శుక్రవారం సాయంత్రం శ్రీకాకుళంలోని సన్‌రైజ్ హోటల్‌లో ఆ పార్టీ ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. జనవరి 12న రణస్థలంలో నిర్వహించనున్న యువభేరి కార్యక్రమంపై చర్చించి, రానున్న రోజుల్లో చేపట్టాల్సిన కార్యక్రమాలను వివరించారు.

వృద్ధులకు ఉచిత న్యాయసేవలు


వృద్ధులకు పళ్లు పంచుతున్న సన్యాసినాయుడు

శ్రీకాకుళం అర్బన్ : వృద్ధులకు న్యాయసేవా సంస్థ ద్వారా న్యాయసేవలు అందించడం జరుగుతోందని న్యాయసేవా సంస్థ జిల్లా కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు తెలిపారు. నగరంలోని బొందిలిపురంలో ఖ్యాతి ఫౌండేషన్ వృద్ధ ఆశ్రమాన్ని ఆయన సందర్శించారు ఈ సందర్భంగా ఆశ్రమంలోని వృద్ధులతో వ్యక్తిగతంగా మాట్లాడి, వారి సమస్యలు తెలుసుకున్నారు వారు ఎవరికైనా న్యాయసహాయం కావాల్సివస్తే న్యాయసేవా సంస్థకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో గేదెల ఇందిరాప్రసాద్, ఖ్యాతి ఫౌండేషన్ సెక్రటరీ శ్రావణి, తదితరులు పాల్గొన్నారు.

జాడుపల్లిలో ఇంటింటికీ ఎంజిఆర్


కరపత్రాలను పంపిణీ చేస్తున్న ప్రతినిధులు

మెళియాపుట్టి: మండలంలో సవర జాడుపల్లి, జాడుపల్లి, బాణాపురం, సవర బాణాపురం, బాణాపురం కాలనీ, బగడ, ఎకువ బగడ, గొల్ల బంజీరు, పదనాపురం, జగన్నాథపురం తదితర గ్రామాల్లో ఎంజిఆర్ యువసేన ఆధ్వర్యంలో ఇంటింటికీ ఎంజిఆర్ కార్యక్రమం నిర్వహించారు. మారుమూల గిరిజన గ్రామాల్లో తిరుగుతూ వాళ్ల కష్టసుఖాలను అడిగి తెలుసుకున్నారు. 12 సంవత్సరాలుగా మామిడి గోవిందరావు చేస్తున్న సేవా కార్యక్రమాలు, సేవలపై అవగాహన కల్పించారు. కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పట్టుపురం ఎంపిటిసి ప్రతినిధి నంబాల వెంకటరావు, మాజీ సర్పంచ్ ఎస్.బాబురావు, యువసేన సభ్యులు తిరుపతిరావు, సిహెచ్ కిషోర్, వెంకటరమణ, శ్రీనివాసరావు, బుడ్డు, మణిపాల్, కె.రమేష్ ,శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఆమదాలవలస: పట్టణంలో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్‌శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు సత్తారు బయ్యన్నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనున్నట్లు తెలిపారు. 33/11 కెవి ఇండోర్ సబ్ స్టేషన్ పరిధిలో 11కెవి బిఆర్.నగర్ ఫీడర్ మరమ్మతులు, చెట్ల కొమ్మలు తొలగించే కార్యక్రమంలో భాగంగా ఉదయం 9.30గంటల నుండి సాయంత్రం 3గంటల వరకు బిఆర్ నగర్, అగ్రికల్చరల్ ల్యాబ్, కెవికె, కొత్త వీధి, వన్‌వే జంక్షన్, రైల్వే స్టేషన్ రోడ్డు, తహశీల్దార్ కార్యాలయ రోడ్డు, లక్ష్మీనగర్ స్కూల్, తదితర ప్రాంతాలకు విద్యుత్ నిలుపుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు గమనించి, తమకు సహకరించాలని కోరారు.

ధాన్యం కొనుగోలు వేగవంతం


మాట్లాడుతున్న ఎంపిడిఒ శ్రీనివాసరెడ్డి

ప్రజాశక్తి - కంచిలి

గ్రామస్థాయిలో ఉన్న రైతు భరోసా కేంద్రాల్లోని ధాన్యం కొలుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామని, వీటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపిడిఒ చల్లా శ్రీనివాసరెడ్డి కోరారు. శుక్రవారం కేసరిపడ సచివాలయం, రైతు భరోసా కేంద్రాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా కేసరిపడ, బెల్లుపడ, ఎక్కల సర్పంచ్‌లు దిల్లేశ్వరరావు, ఆయుధం జయరాం, రంగాల గాయత్రి, స్థానిక రైతులు, వాలంటీర్లతో సమావేశం నిర్వహించారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అందిస్తున్న సేవలపై అవగాహన కల్పించారు. గ్రామ స్థాయిలో రైతులకు అందిస్తున్న సేవలను తెలియజేస్తూ, ప్రతి సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ముఖ్యంగా ధాన్యం కొనుగోలు విషయంలో రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా సిబ్బంది చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎఒ ధనుంజయం, జెడ్‌పిటిసి ప్రతినిధి ఇప్పిలి కృష్ణారావు, రైతులు పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బంది లేకుండా చూడాలి

ప్రజాశక్తి - సోంపేట

ధాన్యం కొనుగోలు సమయంలో రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని జెడ్‌పిటిసి తడక యశోద అధికారులకు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం వ్యవసాయ సహాయ సంచాలకులు జగన్మోహనరావు ఆధ్వర్యాన అవగాహన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ధాన్యం కొనుగోలుకు సంబంధించి గోడపత్రికలు, కరపత్రికలను ఆవిష్కరించారు. అనంతరం అధికారులు మాట్లాడుతూ గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు నిర్వహిస్తామన్నారు. ఈ సౌకర్యాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపిపి డాక్టర్ నిమ్మాన దాసు, ఎంపిడిఒ బి.వెంకటరమణ, తహశీల్దార్ రమేష్‌కుమార్, ఎఒ నరసింహమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు


వ్యాసరచన పోటీలను పరిశీలిస్తున్న కృష్ణమూర్తిరెడ్డి

ప్రజాశక్తి - ఇచ్ఛాపురం

అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా ముందస్తుగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. హ్యూమన్ రైట్స్ కమిషన్ నియోజకవర్గ అధ్యక్షులు దక్కత కృష్ణమూర్తిరెడ్డి ఆధ్వర్యాన ఇచ్ఛాపురంలోని ఆదిత్య, స్వర్ణభారతి, ప్రభుత్వ డిగ్రీ కళాశాలల విద్యార్థులకు వేర్వేరుగా వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎం.రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

లింగ వివక్షతకు ముగింపు పలుకుదాం

ప్రజాశక్తి - జి.సిగడాం

లింగ వివక్షతకు ఇక ముగింపు పలుకుదాం అంటూ మండల మహిళా ప్రతినిధులు ఎపిఎం రెడ్డి రామకృష్ణనాయుడు ఆధ్వర్యాన ర్యాలీ నిర్వహించారు. లింగ వివక్షత జాతీయ వ్యతిరేక ప్రచారంలో భాగంగా శుక్రవారం వెలుగు కార్యాలయం ర్యాలీగా వెళ్లి, ఇంటింటా అవగాహన కల్పించారు..ఈ సందర్భంగా లైంగిక వేధింపులను అరికడదాం, లింగ వివక్షత నిర్మూలిద్దాం అంటూ నినాదాలు చేశారు. ఈనెల 23 వరకు ఈ లింగ వివక్షత వ్యతిరేక ప్రచార కార్యక్రమాలు జరుగుతాయని ఎపిఎం పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామ సంఘ సభ్యులు, సిసి మురళి, విఒఎ జయలక్ష్మి, పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న ఎపిఎం రామకృష్ణనాయుడు


ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో ఎమ్మెల్యే అశోక్, నాయకులు


కవిటిలో..



మెళియాపుట్టి : ప్రభుత్వ వైఫల్యాలపై వివరిస్తున్న సాగర్

రాష్ట్రానికి ఇదేం ఖర్మ

ప్రజాశక్తి - కంచిలి

జగన్మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్రానికి ఇదేం ఖర్మ అని ఎమ్మెల్యే బెందాళం అశోక్ అన్నారు. శుక్రవారం మండపల్లి పంచాయతీలో ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేతో పాటు టిడిపి మండల నాయకులు ఇంటింటికీ తిరుగుతూ ప్రస్తుతం రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం చేస్తున్న పరిపాలన గురించి తెలియజేశారు. ఒక్క ఛాన్స్ అంటూ గద్దెనెక్కిన జగన్మోహన్‌రెడ్డి రాష్ట్ర ప్రజలంతా ఇదేం ఖర్మరాబాబు అనుకునే స్థితికి పరిపాలన దిగజార్చారన్నారు సంక్షేమ పథకాల పేరిట పావలా ఇస్తూ ప్రజలకు తెలియకుండానే పెను భారాలు మోపుతున్నాని విమర్శించారు. రానున్న ఎన్నికల్లో చంద్రబాబును గెలిపించి ఈ అరాచక పాలనకు ముగింపు పలకాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌ఛార్జి మాదిన రామారావు, యూనిట్ ఇన్‌ఛార్జి కామేష్, బి.కామేష్‌రెడ్డి, టివి.రమణ, మఱ్రిపాటి పూర్ణ, బొడ్డ రామ్‌కుమార్, బొడ్డ హరిబాబు, వెనకటరమణ, శ్రీను, జగదీష్ పట్నాయక్, కురయ్య తదితరులు పాల్గొన్నారు.

మెళియాపుట్టి: మండలంలో పెద్ద లక్ష్మీపురం గ్రామంలో టిడిపి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్రానికి ఇదేం కర్మ కార్యక్రమాన్ని టిడిపి రాష్ట్ర కార్యదర్శి కలమట సాగర్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలపై తెలియజేశారు. రానున్న ఎన్నికల్లో టిడిపిని ప్రజలంతా ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు భాస్కర్ గౌడ్, జిల్లా మహిళా ఉపాధ్యక్షులు బూర్ల లలితకుమారి, వసంత్, బిర్లంగి ఢిల్లీరావు, ఎం.తిరుపతిరావు, కదంబల పైడిరాజు, మాలతి శ్రీధర్, పరమేశ్వర్‌రెడ్డి, సిలార్, పలువురు నాయకులు పాల్గొన్నారు.

కొరికానపుట్టుగలో 'ఇదేమి ఖర్మ రాష్ట్రానికి'

కవిటి: మండలంలోని కపాసుకుద్ది పంచాయతీ కొరికానపుట్టుగలో శుక్రవారం ఇదేం ఖర్మ రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు. రాష్ట్రంలో వైసిపి అమలు చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలు, పెరుగుతున్న ధరలు తదితర అంశాలు వివరించారు. కార్యక్రమంలో కొర్రాయి వాసుదేవ్, కె కుర్మారావు తదితరులు పాల్గొన్నారు.

పని ఒత్తిడిని తగ్గించండి

కలెక్టర్‌ను కోరిన గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం నాయకులు

ప్రజాశక్తి-శ్రీకాకుళం అర్బన్

జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో సేవలు అందిస్తున్న గ్రామ రెవెన్యూ అధికారులు తీవ్రమైన ఒత్తిడికి గురవుతున్నారని, దీనివల్ల అనారోగ్యం, ఇతర సమస్యలతో ప్రాణాలు పోగొట్టుకునే స్థితిలో కొందరు ఆస్పత్రుల పాలవుతున్నారని, అందువల్ల పని భారం, ఒత్తిడిని తగ్గించాలని గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం నాయకులు కలెక్టర్‌ను కోరారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఆయన ఛాంబరులో కలిసి వినతిపత్రం అందించారు. రీ సర్వే వల్ల గ్రామాల్లో రేయింబవళ్లు పనిచేస్తున్నామని, ఈ సమయంలో కొన్ని సార్లు తీవ్రమైన ఒత్తిడికి గురికాక తప్పడం లేదని వివరించారు. మరోవైపు ఆర్ఓఆర్ పనులు, భూహక్కు పత్రాల పంపిణీ, భూరికార్డుల సవరణ, సర్వే రాళ్ల పాతించడం, 22ఎ రిజిస్టర్ల తయారీ, రీసర్వే మ్యాప్‌లను తయారు చేయడం వంటి బాధ్యతల్లో సర్వేశాఖ నుంచి సహకారం అందలేదని ఫిర్యాదుచేశారు. మరోవైపు ధాన్యం కొనుగోళ్లు, రైస్ మిల్లర్లతో సమన్వయం చేసుకుని గోనె సంచులు, ట్రాక్టర్లు, కార్మికులు వంటి మౌలిక వసతులు సమకూర్చడం వంటి పనులతో ఒత్తిడి పెరుగుతోందన్నారు. ఎన్నికల విధుల్లో భాగంగా సెలవు రోజుల్లో కూడా ప్రత్యేక క్యాంపెయిన్, క్లెయిమ్స్ పరిష్కారం, ఓటర్ల ఆధార్ సీడింగ్, వెరిఫికేషన్ చేయాల్సి వస్తుందన్నారు. మరో వైపు క్షేత్ర స్థాయిలో మౌళిక వసతులు సమకూర్చ కుండా పని ఒత్తిడి పెంచడం సరికాదన్నారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో సంఘం ప్రతినిధులు రఘుపాత్రుని ప్రసాదరావు, రమేష్‌కుమార్ తదితరులు ఉన్నారు.

రక్తదానంపై అవగాహన అవసరం



ఉద్యోగులు, కార్మికులకు ధ్రువపత్రాలను అందిస్తున్న యాజమాన్య ప్రతినిధులు

ప్రజాశక్తి-రణస్థలం

రక్తదానంపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని ఎన్‌టిఆర్ ట్రస్టు డాక్టర్ పి.సత్యనారాయణ పిలుపునిచ్చారు. అరబిందో ఫార్మా ఫౌండేషన్ సామాజిక సేవా కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఎన్‌టిఆర్ ట్రస్టు, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు ఆధ్వర్యాన రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ రక్తదానం చేసి ఇంకొకరికి ప్రాణదాతలు కావాలని పిలుపునిచ్చారు. జిల్లాలో రక్తపు నిల్వలు చాలా ప్రమాదకర స్థితిలో ఉన్నాయని, ఆ కొరతను అధిగమించడానికి ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా రక్తదానం చేయాలని ఆయన కోరారు. హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు వైస్ ప్రెసిడెంట్ కె.శ్రీనివాసరాజు మాట్లాడుతూ కొంతమందికి రక్తదానంపై అపోహలు ఉన్నాయని, వారిలో అపోహలు తొలగించాలని అన్నారు. అరబిందో ఫార్మా కార్పొరేట్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ యుఎన్‌బి.రాజు, కె.కమలాకర్‌రెడ్డి, ఎన్.రాజారెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్క ఆరోగ్యవంతుడు రక్తదానం చేయడం వల్ల రక్తం శుద్ధి బాగా జరుగుతుందని, దాని వల్ల ఆ వ్యక్తికీ ఎటువంటి ఆరోగ్య సమస్యలు రావని అందువలన ప్రతి ఒక్కరూ రక్తదానం చేయవచ్చని సూచించారు. కార్యక్రమంలోఉద్యోగులు, కార్మికులు పాల్గొని రక్తదానం చేసారు. కార్యక్రమంలో అరబిందో ఫార్మా మెడికల్ ఆఫీసర్ డాక్టర్ బురహన్ సయ్యద్ సమన్వయకర్తగా వ్యవహరించారు.

సమస్యల పరిష్కారంలో తాత్సారం తగదు


మాట్లాడుతున్న సంఘ నాయకులు

ప్రజాశక్తి - రణస్థలం

పెన్షనర్ సమస్యల పరిష్కారంలో రణస్థలం ఎస్‌టిఒ కార్యాలయం తాత్సారం తగదని విశ్రాంత్రి ఉద్యోగుల సంఘం అధ్యక్ష, కార్యదర్శి పున్నాన నరసింహులునాయుడు, ఎడ్ల పాపి నాయుడు కోరారు. ఈ నెల 17వ తేదీన పెన్షనర్స్ డేలో నియోజకవర్గంలోని అన్ని మండలాల విశ్రాంత ఉద్యోగులు పాల్గొని, విజయవంతం చేయాలని కోరారు. శుక్రవారం రణస్థలం మండలం గరికిపాలెంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. రణస్థలం ఎస్‌టిఒ కార్యాలయంలో విశ్రాంత ఉద్యోగులు, ఉపాధ్యాయులు, రెగ్యులర్ టీచర్స్‌సమస్యల పరిష్కారంలో ఎస్‌టిఒ కార్యాలయ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని అన్నారు. పెన్షనర్ల సమస్యలపై పలుమార్లు వారి దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం శూన్యమన్నారు. ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగుల రిటైర్మెంట్ బెన్‌ఫిట్స్ చెల్లించాలని డిమాండ్ చేశారు. 36 మంది పెన్షనర్ల ఫైల్స్‌ను పెండింగ్‌లో ఉంచడం దారుణమని అన్నారు. తమ సమస్యలు పరిష్కరించకుంటే దశల వారీగా ఉద్యమిస్తామని తెలిపారు. సమావేశంలో పాపినాయుడు, సిహెచ్ గోపాల్‌రావు, ఎం.వి.రమణ, వెంకటస్వామి, ఎం.కృష్ణానందం, తదితరులు పాల్గొన్నారు.

మూడు రాజధానులతో అభివృద్ధి


సంతకాలు చేయించిన పుస్తకాలను చూపిస్తున్న డ్వాక్రా మహిళలు

ప్రజాశక్తి - ఇచ్ఛాపురం

మూడు రాజధానులతోనే రాష్ట్రం అభివృద్ధి సాధ్యమని మున్సిపల్ ఛైర్‌పర్సన్ పి.రాజ్యలక్ష్మి అన్నారు. శుక్రవారం మూడు రాజధానులకు మద్దతుగా, విశాఖ పరిపాలనా రాజధాని కావాలంటూ డ్వాక్రా సంఘాల మహిళలు, నాన్ పొలిటికల్ జెఎసి పిలుపుమేరకు ఛైర్‌పర్సన్ ఆధ్వర్యాన శుక్రవారం తీర్మానం చేశారు. ఆ తీర్మానాన్ని జెఎసి అధ్యక్షులు హనుమంతు లజపతిరాయ్‌కు పంపించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మూడు రాజధానుల వల్ల అన్ని ప్రాంతాలకూ సమాన ప్రాధాన్యత ఉంటుందని అన్ని రంగాలలో కూడా యువత కు మెండుగా అవకాశాలు లభిస్తాయని అన్నారు. రాష్ట్రంలో ఉపాధి అవకాశాలు పెరిగి ముఖ్యంగా మహిళలకు మరిన్ని అవకాశాలు మెరుగవుతాయని తెలిపారు. అభివృద్ధి ఒకే దగ్గర కేంద్రీకృతం కాకుండా భవిష్యత్ తరాలకు మంచి అవకాశాలు అందించాలన్న ఆలోచనతో ముందుకు వెళ్తున్న సిఎంను కొనియాడారు. అనంతరం మహిళా సంఘాల సభ్యులు మూడు రాజధానులకు మద్దతుగా సంతకాలు చేసిన పత్రంను ఛైర్‌పర్సన్‌కు అందజేశారను. కార్యక్రమంలో టిఎల్‌ఎఫ్ సమైక్యలో ఒబిలు సుధారాణి, పద్మ, ఢిల్లేశ్వరి, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

ఎపిజివిబి సేవలను వినియోగించుకోవాలి



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న కళాకారులు

ప్రజాశక్తి - బూర్జ

ఎపిజివిబి సేవలను సద్వినియోగం చేసుకొని, ఆర్థికంగా ఎదగాలని బూర్జ బ్రాంచ్ మేనేజర్ కిరణ్‌కుమార్ అన్నారు. శుక్రవారం సాయంత్రం కె.కె.రాజపురంలో గ్రామీణ వికాస్ బ్యాంకు ఆధ్వర్యాన విభూతి బ్రదర్స్ బ్యాంకు ద్వారా అందిస్తున్న సేవలు, వ్యవసాయ, వ్యాపార, విద్య, బంగారు రుణాలపై, సైబర్ దొంగతనాలు, ఎటిఎం, పిఎంజెజెబివై, పిఎం ఎస్‌బివై వంటి ప్రమాద బీమా పథకాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ సతీష్, క్యాషియర్ కిశోర్, సర్పంచ్ కొరికాన సీతారామరాజు, సిఎస్‌పిలు బి.ప్రేమకుమార్, కె.వి.రమణ, ఖాతాదారులు, మహిళలు, స్థానికులు పాల్గొన్నారు.

పంచాయతీల అభివృద్ధే లక్ష్యం



మాట్లాడుతున్న ఎంపిడిఒ సూర్యనారాయణ

ప్రజాశక్తి - కవిటి

పంచాయతీల అభివృద్ధే లక్ష్యంగా పనిచేయాలని ఎంపిడిఒ పైలా సూర్యనారాయణ అన్నారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో మండలంలోని పలు పంచాయతీల సర్పంచులు, ఎంపిటిసిలు, పంచాయతీ కార్యదర్శులు, అధికారులకు గ్రామ పంచాయతీలు-అభివృద్ధి ప్రణాళికలు అనే అంశంపై శుక్రవారం శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యంగా పేదరికంలేని సమాజం కోసం పంచాయతీ నుంచే ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. అంతేకాకుండా ప్రభుత్వ పథకాలు ప్రజలకు నేరుగా అందేలా, పంచాయతీల్లో మారుమూల ప్రాంతాలకు కూడా పూర్తి మౌలిక సదుపాయాలు కల్పించేలా కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో పశు వైద్యురాలు డాక్టర్ శిరీష, బెలగాం సర్పంచ్ ప్రతినిధి మద్దిలి ఈశ్వరరావు, గొర్లేపాడు, సిలగాం, కరాపాడు, లండారిపుట్టుగ, కొజ్జిరియా, బెళగాం, డిజి పుట్టుగ, ఆర్.భైరిపురం పంచాయతీల సర్పంచులు, ఎంపిటిసిలు, పంచాయతీ కార్యదర్శులు, అంగన్వాడీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

'ఐతమ్'లో ముగిసిన ఎఫ్‌డిపి

ప్రజాశక్తి - టెక్కలి రూరల్

టెక్కలి ఆదిత్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్మెంట్ ఇంజినీరింగ్ కళాశాల ఈఈఈ విభాగంలో ఈనెల 5 నుండి 9 వరకు 'రీసెర్చ్ స్కోప్ ఇన్ ఎలక్ట్రిక్ వెహికల్స్' అనే అంశంపై చండీఘర్‌లో ఉన్న ఎన్ఐటిటిటిఆర్, ఎఎన్ఎస్ఎవైఎస్, ఐతమ్ ఈఈఈ విభాగాల సౌజన్యంతో అధ్యాపకులు, రీసెర్చ్ స్కాలర్స్ ఆన్‌లైన్ ద్వారా నిర్వహించిన శిక్షణ తరగతులు ముగిశాయని కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరరావు శుక్రవారం తెలిపారు. ఈ తరగతుల్లో 41 మంది పాల్గొనగా, అత్యాధునిక సాంకేతికత వినియోగం, నేటి సమాజంలో ఎలక్ట్రికల్ వాహనాల ఆవశ్యకత వంటి అంశాలపై అవగాహన పొందారన్నారు. ఈ తరగతులు అధ్యాపకులకు, విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడతాయని ఇటువంటి శిక్షణా తరగతులు తరచుగా ఏర్పాటు చేయాలని డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి. నాగేశ్వరరావు కోరారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, డైరెక్టర్ ఆరెండీ డాక్టర్ కె.బి.మధుసాహు, కో-ఆర్డినేటర్ కె.కిరణ్‌కుమార్, కో-కన్వీనర్లు డాక్టర్ డి.శ్రీనివాసరావు, డాక్టర్ డి.రామారావులు సదస్సులను పర్యవేక్షించారు.

గ్రంథాలయ కార్యదర్శి మృతికి సంతాపం

ఇచ్ఛాపురం: పట్టణంలోని ఒడియా గ్రంథాలయ కార్యదర్శి హరికృష్ణ పాడి అనారోగ్యంతో మృతిచెందారు. ఆయన మృతికి ఒడియా మైనారిటీ సంఘం, ఒడియా గ్రంథాలయ కమిటీ సభ్యులు స్థానిక గ్రంథాలయంలో శుక్రవారం సంతాప సభ నిర్వహించారు. నివాళులర్పించారు. కార్యక్రమంలో రఘునాథ్ పాడి, శివప్రసాద్ పండా, రాజేంద్ర పండా, సత్యనారాయణ పాడి, త్రినాథ్ సాహు, శ్రీనివాస్‌దాస్, తదితరులు పాల్గొన్నారు.

మోటార్లను తొలగించాలి

ప్రజాశక్తి - ఆమదాలవలస

ఇంటి కుళాయిలకు బిగించిన అక్రమ మోటార్లను వెంటనే తొలగించాలని మున్సిపల్ మేనేజర్ బి.లక్ష్మీనారాయణ ఒక ప్రకటనలో కోరారు. పురపాలక సంఘం పరిధిలో కుళాయిల ద్వారా మంచినీటి సరఫరా జరుగుతున్న సమయంలో పూజారిపేట, డాబాలవారి వీధి, కొత్తకోట వారి వీధి, చంద్రయ్యపేట, గేటు, పాత ఆమదాలవలస, తదితర ప్రాంతాల్లో కొంతమంది ఇంటి యజమానులు వారి ఇంటి కుళాయిలకు మోటార్లు పెట్టి మంచినీటిని వాడుకుంటున్నట్లు ఫిర్యాదులు అందాయని తెలిపారు. వెంటనే వాటిని తొలగించాలని, లేకుంటే వారి కుళాయి కనెక్షన్ తొలగించడమే కాకుండా చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు మోటార్లను కార్యాలయ సిబ్బంది స్వాధీనపరచుకొని అపరాధ రుసుం విధించబడునని ఆయన పేర్కొన్నారు.


ఆడిట్ నిర్వహిస్తున్న సభ్యులు

పక్కాగా పంచాయతీరాజ్ ఆడిట్

ప్రజాశక్తి - కవిటి

పంచాయతీరాజ్ ఆడిట్ పక్కాగా నిర్వహిస్తున్నట్లు ఆడిట్ సభ్యులు కె.శ్రీనివాస్ తెలిపారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో పంచాయతీరాజ్ ఆడిట్ శుక్రవారం ప్రారంభమైంది. మండలంలోని పంచాయతీల్లో ఇటీవల నిర్వహించిన పనులకు సంబంధించిన ఆడిట్ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమం మరో మూడు రోజుల పాటు జరగనున్నట్లు ఆడిట్ సభ్యులు తెలిపారు. ఇటీవల మండల పరిషత్ ఆడిట్ జరిగిందని, ఆ ఆడిట్‌లో ఎటువంటి లేప్స్ కానీ, అనవసర నగదు చెల్లింపులు కానీ జరగలేదని శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర ఆడిట్ డిపార్టుమెంటు సభ్యులు గోపాలకృష్ణ, కొండలరావు, ప్రదీప్ పాల్గొన్నారు.


స్త్రీనిధితో జీవనోపాధి

ప్రజాశక్తి - ఆమదాలవలస

పంచ సూత్రాలు పాటిస్తున్న ప్రతి స్వయంశక్తి సంఘ సభ్యురాలు జీవనోపాదులను మెరుగుపర్చుటకు, వారి ఆర్థిక అవసరాలకు ఆదాయాభివృద్ధి కార్యక్రమాల నిమిత్తం, అర్హతగల వారికి స్త్రీ నిధి బ్యాంకు ద్వారా రుణం మంజూరు చేస్తున్నట్లు ఎపిఎం కూర్మారావు తెలిపారు. శుక్రవారం వంజంగిపేటలో మహిళా సంఘాల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. సంఘం ప్రారంభం నుంచి లావాదేవీలన్నింటినీ కమ్యూనిటీ ఆడిట్ సిఆర్పి లతో సభ్యులందరికీ అవగాహన కల్పిస్తూ సభ్యుల అవసరమేరకు పొదుపుల నుంచి గ్రామ సంఘాల ద్వారా స్త్రీనిధి బ్యాంకు ద్వారా జీవనోపాదులను కల్పిస్తున్నట్లు వివరించారు . కార్యక్రమంలో క్లస్టర్ కోఆర్డినేటర్ రమణ ,విఒఎ చంద్రకళ, గ్రామ సంఘం అధ్యక్షులు దవళ లక్ష్మీకాంతం, సర్పంచ్ పైడి లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

శివరాంపురం అంగన్వాడీ కేంద్రం పరిశీలన

సంతబొమ్మాళి: మండలంలోని శివరాంపురం అంగన్వాడీ కేంద్రాన్ని ఎంపిడిఒ జి.ఉమా సుందరి ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. అంగన్వాడీ కేంద్రంలో రికార్డులు, పిల్లల హాజరు, మెనూ పరిశీలించారు. గ్రామంలో ఎస్‌సిలు ఎవరూ లేకపోయినప్పటికీ ఆయా పోస్టు ఎస్‌సిలకు ప్రభుత్వం రిజర్వు చేయడంతో పిల్లలు ఇబ్బంది పడుతున్నారని గ్రామస్తులు ఆమె దృష్టికి తీసుకొచ్చారు. ఎంపిడిఒ మాట్లాడుతూ ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని అన్నారు. ఆమెతో పాటు సర్పంచ్ ప్రతినిధి కళింగపట్నం అప్పారావు ఉన్నారు.


రికార్డులను పరిశీలిస్తున్న ఎంపిడిఒ